నమస్తే తెలంగాణ
# పెద్దపల్లి
5 కరీంనగర్, గురువారం 19 జూన్ 2025 PEDDAPALLI

## డాక్టర్ చెన్నాడి రవీందర్‌రావు ఇకలేరు

- అనారోగ్యంతో దవాఖానలో చేరి చికిత్స పొందుతూ మృతి


చెన్నాడి రవీందర్‌రావు (ఫైల్)

కరీంనగర్ విద్యానగర్, జూన్ 18: సీనియర్ జనరల్ సర్జన్, ప్రతిమ డీఎంఈ డాక్టర్ చెన్నాడి రవీందర్‌రావు కన్నుమూశారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ హాస్పిటల్‌లో చేరి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. జిల్లాలో సీనియర్ జనరల్ సర్జన్‌గా పనిచేస్తున్న ఆయన, పేదలకు ఉచితంగా చికిత్స అందిస్తూ మన్ననలు పొందారు. ఆయన మృతికి హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ సంతాపం ప్రకటించారు. 1975లో దేశంలో ఎమర్జెన్సీ విధించిన సమయంలో తనతోబాటు చాలా మందిని మిసా చట్టం కింద చంచల్‌గూడ జైలులో నిర్బంధించినప్పుడు రవీందర్ రావు జైలు డాక్టర్‌గా సేవలందించారని గుర్తు చేశారు. ఆయన మృతికి కరీంనగర్‌లోని సీనియర్ వైద్యులు ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేశ్‌తో పాటు ప్రతిమ, చల్మెడ వైద్యులు సంతాపం ప్రకటించారు. ఆయన అంత్యక్రియలను గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కొరెంలో నిర్వహిస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.




కుంటయ్య కూతురును ఓదార్చుతున్న కేటీఆర్

బీఆర్ఎస్ కార్యకర్త కుంటయ్య మృతదేహానికి పూలమాల వేసి నమస్కరిస్తున్న అర్పిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

# అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

### కుంటయ్య కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం

- పిల్లల చదువు, పెళ్లిళ్ల బాధ్యత తీసుకుంటాం
- ఆత్మహత్యకు కారకులను ఏ ఒక్కరినీ వదిలిపెట్టం
- న్యాయం కోసం కోర్టుకెళ్తాం
- పోలీసులు సివిల్ మ్యాటర్‌లో దూరి అరాచకాలు సృష్టిస్తున్నారు
- బాధితుడిపైనే ఉల్టా కేసు పెట్టారు
- సెటిల్‌మెంట్లకు పోలీస్‌స్టేషన్లు అడ్డాగా మారాయి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కుటుంబసభ్యులకు ఓదార్పు
- మాజీ ఎంపీటీసీ కుంటయ్య మృతదేహానికి నివాళి

'తన భూమిని కాంగ్రెస్ నాయకుడు కబ్జా చేశాడని, తమ బీఆర్ఎస్ కార్యకర్త, మాజీ ఎంపీటీసీ కుంటయ్య పోలీసులను ఆశ్రయిస్తే ఉల్టా అతడిపైనే కేసు పెట్టారు. పోలీసుల వేధింపుల వల్లే అతడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుంటయ్య చావుకు కారకులైన ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోం. కోర్టును ఆశ్రయించి న్యాయ పోరాటం చేస్తాం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తెలంగాణలోని పోలీస్ స్టేషన్లు సెటిల్‌మెంట్లకు అడ్డాగా మారాయని, సివిల్ మ్యాటర్లో తలదూర్చి పోలీసులు అరాచకాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. పురుగుల మందు తాగి మంగళవారం ఆత్మహత్య చేసుకున్న తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ గ్రామ బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ కర్కబోయిన కుంటయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ప్రభుత్వ దవాఖానకు తరలించగా, బుధవారం మృతదేహానికి పూలమాల వేసి కేటీఆర్ నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని, అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు.


తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్‌లో కుంటయ్య అంతిమయాత్రలో పార్టీ నేతలు, గ్రామస్తులు

రాజన్న సిరిసిల్ల, జూన్ 18 (నమస్తే తెలంగాణ)/ సిరిసిల్ల రూరల్ : బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ కర్కబోయిన కుంటయ్య ఆత్మహత్య చేసుకోవడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విచారం వ్యక్తం చేశారు. సిరిసిల్ల ప్రభుత్వ దవాఖానలో కుటుంబ సభ్యులను పరామర్శించారు. పోలీసుల వేధింపుల వల్లే కుంటయ్య ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. కుంటయ్య తన బాధను చెప్పుకోలేదని, చెప్పి ఉంటే ఆదుకునేవాళ్లమని చెప్పారు. రెండు రోజుల కింద హైదరాబాద్‌కు వచ్చి, అదే రోజు రాత్రి ఇలా అఘాయిత్యం చేసుకోవడం తనను కలిచివేసిందని చెమ్మగిల్లిన కళ్లతో కేటీఆర్ భావోద్వేగానికి లోనయ్యారు. కాంగ్రెస్ నాయకుడు తన భూమిని కబ్జా చేశాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడిపైనే ఉల్టా కేసులు బనాయించి, వేధింపులకు గురిచేయడం సమాజానికి ఎంతమాత్రం మంచిది కాదని, పోలీసుల తీరు మార్చుకోవాలని హితవుపలికారు. కాంగ్రెస్ నాయకులు ఏం చేప్తే అది చేయడాన్నే తమ డ్యూటీగా భావించి పోలీసులు విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. కుంటయ్య చావుకు కారణమైన పోలీసులపై చర్యలు తీసుకునే వరకు న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. తాము అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ నేతలు ఎవరూ ఇంత చిల్లర పనులు చేయలేదని, పోలీసులు హుందాగా వ్యవహరించారని హితవుపలికారు.

### కుటుంబానికి మేమున్నాం

కుంటయ్య కుటుంబానికి అండగా తామున్నామని కేటీఆర్ భరోసా ఇచ్చారు. ఆయన దహన సంస్కారాలన్నీ పార్టీ దగ్గరుండి చూసుకుంటుందని భార్య విజయకు ధైర్యం చెప్పారు. ఆయన కూతుళ్లు భార్గవి, దీక్షిత చదువులు, పెళ్లిళ్లు అన్నింటికీ బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. అన్ని విధాలుగా పార్టీ వెన్నంటి ఉంటుందని, అధైర్య పడొద్దంటూ మనో ధైర్యం కల్పించారు. పురుగుల మందు తాగిన కుంటయ్యను కాపాడుకునేందుకు శాయశక్తులా ప్రయత్నించినా సాధ్యం కాలేదన్నారు. నిబద్ధతగల నాయకుడు, నిఖార్సైన గులాబీ సైనికుడు కుంటయ్య లేని లోటు పార్టీకి తీరనిదని ఆవేదన వ్యక్తం చేశారు. 'ఈ రోజు కుంటయ్యకి జరిగింది. రేపు మరొకరికి జరగొచ్చు. ఈ అరాచకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అదుపుచేయాలి' అని డిమాండ్ చేశారు. ఈ ఆపద సమయంలో కుంటయ్య కుటుంబానికి మనోధైర్యాన్ని ఆ భగవంతుడు ప్రసాదించాలని కోరుకున్నారు. పెద్దకర్మ జరిగే వరకు పార్టీ జిల్లా నాయకత్వమే అన్ని పనులూ దగ్గరుండి చూసుకుంటుందన్నారు. కేటీఆర్ వెంట చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఉమ్మడి జిల్లా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్ఎస్ జిల్లా, సిరిసిల్ల పట్టణాధ్యక్షులు తోట ఆగయ్య, జిందం చక్రపాణి, మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, నాయకులు బొల్లి రామ్మోహన్, పడిగెల రాజు, కోడి అంతయ్య, అడ్డగట్ల భాస్కర్, కుర్మ రాజయ్య, తదితరులు ఉన్నారు.

### తరలివచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలు

బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త కుంటయ్యను బతికించేందుకు నాయకులు తీవ్రంగా ప్రయత్నించారు. గడ్డి మందు తాగిన విషయం తెలిసిన వెంటనే హుటాహుటిన సిరిసిల్ల దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో కేటీఆర్ ఆదేశాల మేరకు మెరుగైన చికిత్స కోసం ఎల్లారెడ్డిపేటలో అశ్విని దవాఖానకు తీసుకెళ్లారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణితో కలిసి నాయకులంతా దవాఖానకు తరలివెళ్లారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకున్న కేటీఆర్ హైదరాబాద్‌కు తీసుకు రావాలంటూ చెప్పడంతో తరలించే ప్రయత్నంలోనే అతను తుది శ్వాస విడిచినట్టు వైద్యులు తెలిపారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో సిరిసిల్లకు తరలి వచ్చారు. పోస్టుమార్టం పూర్తయిన తర్వాత తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ స్వగ్రామానికి మృతదేహాన్ని తీసుకెళ్లి దహన సంస్కారాలు చేశారు. కుంటయ్య అంతిమయాత్రకు పార్టీ నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు భారీగా హాజరై, కన్నీటి వీడ్కోలు పలికారు. అంత్యక్రియలు పూర్తయ్యే వరకు పార్టీ నేతలు ఉన్నారు.

## రోడ్డు విస్తరణా..? పరాయి దేశంపై యుద్ధమా..?

- వేములవాడలో అధికారుల తీరు బాధాకరం
- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మీనరసింహారావు


మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ, జూన్ 18: వేములవాడలో జరుగుతున్నది ప్రధాన రహదారి విస్తరణా..? పరాయి దేశస్తులపై యుద్ధమా..? అని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మీనరసింహారావు మండిపడ్డారు. ఇక్కడ విస్తరణను చూస్తే పరాయి దేశంపై యుద్ధం చేసినట్టుగా మీ పాలన ఉన్నదని విమర్శించారు. వేకువజామునే వందలాది పోలీసులు, జేసీబీలతో నిర్వాసితులపై దాడి చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఏళ్ల తరబడిగా ఉన్న దుకాణాలు, నివాసాలు కోల్పోతున్న తరుణంలో మానవీయ కోణంలోనైనా కనీసం గడువు ఇవ్వకుండా, సామగ్రి ఉండగానే ఎలాంటి పరిహారం ఇవ్వకుండా అధికారులు వ్యవహరించిన తీరు అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వేములవాడలోని ఆయన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రహదారి విస్తరణకు తాము వ్యతిరేకం కాదని నిర్వాసితులు పదేపదే చెబుతున్నా స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులతో చొరవచూపాల్సింది పోయి పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. నిర్వాసితులకు పరిహారం ఇవ్వకముందే ఇండ్లు, దుకాణాలు ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడం ఏంటని? మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా..? రాచరిక పాలనలో ఉన్నామా..? అని ప్రశ్నించారు. వేములవాడ ప్రధాన రహదారి విస్తరణలో పరిహారం ఒకరికి గజానికి ₹11 వేలు.. మరొకరికి ₹లక్షా 56 వేలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఇన్ని తేడాలు ఉన్నాయని నిర్వాసితులు పదేపదే ఎమ్మెల్యేకు విన్నవించినా.. వారితో ఒక సమావేశం కూడా నిర్వహించకుండా, కనీసం చర్చించకుండా అధికారులతో కలిసి ఏకపక్షంగా వ్యవహరిస్తున్న తీరు సరికాదని హితవుపలికారు. రాజన్న, బద్దిపోచమ్మ ఆలయాల విస్తరణ కోసం గతంలో తమ ప్రభుత్వం ఏ ఒక్కరూ బాధ పడకుండా సమన్వయంతో భూములు సేకరించామన్న విషయం ప్రజలకు తెలుసునన్నారు. ఇప్పటికైనా ప్రధాన రహదారిలో సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు సరైన ధరను నిర్ణయించి న్యాయంచేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం పదేళ్లలో అభివృద్ధి చేయలేదని పదేపదే మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్‌కు వేములవాడలో జరిగిన అభివృద్ధి కనిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాజన్న ఆలయాన్ని నాలుగు ఎకరాల్లో విస్తరిస్తున్నామని చెబుతున్న ఆయన, గత ప్రభుత్వం సేకరించిన 30 ఎకరాలలోనే ఈ నాలుగెకరాలు ఉందన్న విషయం తెలియకపోవడం హాస్యాస్పదమన్నారు. నిత్యాన్నదాన సత్రం కూడా గత ప్రభుత్వం సేకరించిన స్థలంలోనే నిర్మిస్తున్న విషయం కూడా తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. గోశాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని తాము నిలదీయడం ద్వారానే స్పందించిందని, వంద ఎకరాల్లో వేములవాడలో రాజన్న గోశాల ఏర్పాటును స్వాగతిస్తున్నామన్నారు. ఇప్పటికీ కోడెలు మృత్యువాత పడుతున్నట్లు తమకు సమాచారం ఉందని, కోడెల విషయంలో భక్తుల మనోభావాలను కాపాడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని గుర్తు చేశారు. సమావేశంలో పట్టణ ప్రధాన కార్యదర్శి కందుల క్రాంతికుమార్, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, జోగిని శంకర్, నరాల శేఖర్, గోలి మహేశ్, ముద్రకోల వెంకటేశం, నాయకులు పొలాస నరేందర్, కొండ కనుకయ్య, కుమ్మరి శ్రీనివాస్, వెంగళ శ్రీకాంత్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, గుడిసె సదానందం, అంజత్‌పాషా, సయ్యద్‌బాబా, సందీప్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీ రాజరాజేశ్వర ప్రాజెక్టును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

## ప్రాజెక్టులను ఎండబెడుతున్నారు

- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- రిజర్వాయర్ పరిశీలన

బోయినపల్లి రూరల్, జూన్ 18 : మేడిగడ్డ ప్రాజెక్టు నుంచి ఎత్తిపోసిన నీళ్లతో గతంలో మిడ్ మానేరు నిత్యం జలకళతో ఉండేదని, కానీ, మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు కుంగిపోయిందనే సాకుతో కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు విడుదల చేయకుండా రిజర్వాయర్లను ఎండబెడుతోందని ఆ ప్రభావం శ్రీరాజరాజేశ్వర జలాశయంపై పడిందని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తెలిపారు. కొదురుపాకలో ఎడారిలా తలపిస్తున్న ఎస్సారార్ జలాశయాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మేడిగడ్డ నుంచి అనేక లిఫ్టులు, కాలువలు, పంప్ హౌస్‌ల ద్వారా మిడ్ మానేరుకు గోదావరి నీరు చేరేదని, అక్కడి నుంచి ప్రధాన ప్రాజెక్టులైన లోయర్ మానేరు, అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌కు వెళ్లేవని గుర్తు ఇప్పుడు, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతన్నలు ఎంతో నష్టపడిపోయారు అని అన్నారు. ఆయన వెంట మండల ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్, నిమ్మ శ్రీనివాస రెడ్డి, కమల్‌గౌడ్ ఉన్నారు.

## మెడికల్ కాలేజీల భవితవ్యం ప్రశ్నార్థకం


మాట్లాడుతున్న దావ వసంత, చిత్రంలో బీఆర్ఎస్ నాయకులు

- పాలన వదిలేసి ప్రతీకార చర్యలతోనే ఈ దుస్థితి
- ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరవాలి
- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల రూరల్, జూన్ 18 : కాంగ్రెస్ పాలనలో మెడికల్ కళాశాలల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ఆందోళన వ్యక్తం చేశారు. పాలన వదిలేసి ప్రతీకార చర్యలకు దిగుతుండడంతోనే ఈ దుస్థితి వచ్చిందని మండిపడ్డారు. జగిత్యాల మెడికల్ కాలేజీలో మౌలిక వసతులు లేక జాతీయ వైద్య మండలి నోటీసులు జారీ చేసిన సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం ఏర్పడే నాటికి తెలంగాణలో ఐదు ప్రభుత్వ, 15 ప్రైవేట్ మెడికల్ కాలేజీలు, అందులో 2850 ఎంబీబీఎస్ సీట్లు మాత్రమే ఉండేవన్నారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జిలాకో ఒక్క మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడంతో 2023 అక్టోబర్ నాటికి మొత్తం కళాశాలల సంఖ్య 56, సీట్ల సంఖ్య 8340కి చేరిందన్నారు. అప్పటికి కేసీఆర్ ప్రభుత్వం మరో 8 మెడికల్ కాలేజీలు మంజూరు చేయడంతో మొత్తం సీట్ల సంఖ్య 9140 కి చేరిందన్నారు. కానీ, కేసీఆర్ సంకల్పానికి కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పొడుస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ముందు చూపుతో మెడికల్ కాలేజీలను ప్రారంభిస్తే, రేవంత్ పాలనలో వాటి భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. జగిత్యాల మెడికల్ కాలేజీతోపాటు 26 మెడికల్ కాలేజీల్లో సౌకర్యాలు, వసతులు లేకపోవడంపై ఈ నెల 18న ఎన్ఎంసీ ముందు హాజరుకావాలని హెల్త్ సెక్రటరీ, డీఎంఈకి నోటీసులు ఇవ్వడం ఈ ప్రభుత్వం చేతగానితనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి జగిత్యాల జిల్లా మెడికల్ కాలేజీకి కావాల్సిన నిధులు విడుదల చేసి, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. విలేకరుల సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మహేశ్, మాజీ కౌన్సిలర్ దేవేందర్ నాయక్, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్‌రావు, రిజ్వాన్, అనురాధ, బాలే చందు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హౌసింగ్‌బోర్డుకాలనీ, జూన్ 18 : తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ నిర్వహించనున్న యూపీఎస్సీ–సీఎస్ఏటీ–2025 (సివిల్ సర్వీసెస్) ఉచిత శిక్షణకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ బండ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత భోజన వసతి సౌకర్యాలతో హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో శిక్షణకు అన్ని జిల్లాలకు చెందిన అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ విధానం ద్వారా దరఖాస్తులను కోరుతున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు http://tsstudycircle.co.in వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ విధానంలో తమ దరఖాస్తులను పంపించాలని సూచించారు. పూర్తి వివరాలకు 040–23546552, 8121626423 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## పెద్దపల్లి బస్ డిపో సేవలు ప్రారంభమెప్పుడు?

- ఆఫీసులు ఖాళీ చేసి స్థలాలు అప్పగించినా ముందుకు సాగని ప్రక్రియ
- అలాట్‌మెంట్ కాని బస్సులు.. ప్రారంభం కాని డిపో సేవలు
- ప్రయాణికుల ఇబ్బందులు



పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్

పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బస్సు డిపో ఏర్పాటు కలగానే మిగులుతున్నది. గతేడాది ప్రభుత్వం మంజూరు చేసినా, సేవల ప్రారంభం, నిర్మాణంపై తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నది. పాత బస్టేషన్ సమీపంలోని ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఖాళీ చేయించి, 4.31 ఎకరాల స్థలాన్ని అప్పగించినా ప్రక్రియ ముందుకు సాగకపోవడం, బస్సులు అలాట్‌మెంట్ కాకపోవడంపై ప్రయాణికుల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది.

పెద్దపల్లి, జూన్ 18 (నమస్తే తెలంగాణ) : పెద్దపల్లి జిల్లా కేంద్రంగా ఏర్పడి తొమ్మిదేండ్లు పూర్తికావస్తున్నది. గోదావరిఖని, మంథనిలో డిపోలున్నా పెద్దపల్లిలో లేక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో డిపో ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎన్నో రోజులుగా ఉన్నది. ఈ క్రమంలో గతేడాది కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపల్లికి డిపో మంజూరు చేసింది. డిపోకు కావాల్సిన స్థలం కోసం అన్వేషణ చేయగా, పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఆనుకొని ఉన్న ఎంపీడీఓ కార్యాలయ సముదాయంతోపాటు సమీపంలోని మరికొన్ని కార్యాలయాలను ఖాళీ చేయించి, సర్వే నంబర్ 592, సర్వే నంబర్ 589లో 4.31ఎకరాల స్థలాన్ని నూతన డిపోకు కేటాయిస్తూ గతేడాది సెప్టెంబర్‌లో కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉత్తర్వులు జారీ చేశారు. డిపో నిర్మాణానికి ఆర్టీసీ బోర్డు ₹11కోట్లు మంజూరు చేస్తూ జీవో జారీ చేయగా, గత డిసెంబర్ 4న పెద్దపల్లిలో జరిగిన యువ వికాసం బహిరంగ సభకు హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి వేదికపై నుంచే వర్చువల్‌గా డిపో పనులకు శంకుస్థాపన చేశారు. ఇటీవలే టెండర్ల ప్రక్రియ పూర్తయినా ఇంకా నిర్మాణ పనులు మొదలు కాలేదు. కార్యాలయాలు ఖాళీ చేసి అప్పగించి నెలలు గడుస్తున్నా పనులు చేపట్టకపోవడం, బస్సుల అలాట్‌మెంట్, అధికారులు, సిబ్బంది కేటాయింపులు పూర్తి చేసి సేవలను ప్రారంభించాల్సి ఉన్నా నిర్లక్ష్యం చేస్తుండడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. అదే ములుగుకు మంజూరు చేసిన డిపోను నిర్మాణ పనులతో సంబంధం లేకుండా సేవలను ఇటీవల ప్రారంభించారని, పెద్దపల్లిలో ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. తక్షణమే సేవలను ప్రారంభించాలని జిల్లా కేంద్రం ప్రజలు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.





పెద్దపల్లి ఆర్టీసీ డిపోకు కేటాయించిన స్థలంలో ప్రభుత్వ కార్యాలయాలు